## క్లుప్తంగా

### ఆగని మట్టి తరలింపు



కాల్వ సమీపంలో మట్టి తరలించిన దృశ్యం

**ములకలపల్లి:** సీతారామ కాల్వ సమీపంలో ఎర్ర మట్టి తోలకాలు ఆగేలా లేవు. ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం.. అక్రమ తరలింపుపై దృష్టి సారించాం అని అధికారులు చెబుతున్నా, కార్యాచరణకు నోచుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్ధరాత్రి జేసీబీతో టిప్పర్ లారీల్లో మట్టి లోడ్‌చేసి తరలిస్తుండగా ఇటీవల 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీంతో కెనాల్ డీఈ కే. రాంబాబు అక్రమ తోలకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో రెండు రోజులు ఆగిన అక్రమ రవాణా మళ్లీ మొదలైంది. సోమవారం రాత్రి పదుల సంఖ్యలో లారీల్లో మట్టిని అక్రమంగా తరలించినట్లు తెలిసింది.

### ఎంబీబీఎస్‌లో సీటు



సుజిత

**బూర్గంపాడు:** సారపాకకు చెందిన మాడుగుల సుజిత అనే విద్యార్థిని నీట్ పరీక్షల్లో 453 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కాగా సారపాకకు చెందిన సుజిత తండ్రి మాడుగుల నరసింహారావు సెలూన్ నడుపుకుంటు జీవనం సాగిస్తుండగా నీట్‌లో 453 మార్కులు సాధించి జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో సీటు సాధించింది. ఆమెను పలువురు అభినందించారు.

### మృత్యువాత పడిన పెరటికోళ్లు

**చండ్రుగొండ:** పొదుపుసంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధి కోసం మహిళాశక్తి పథకం ద్వారా పంపిణీ చేసిన కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. కొన్నాళ్ల క్రితం తమకు సరఫరా కోడిపిల్లలు మృత్యువాత పడ్డాయని పలువురు ఎంపీడీఓ బయ్యారపు అశోక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. చండ్రుగొండతోపాటు వంకనంబర్, తిప్పనపల్లి, బెండాలపాడుల్లో రెండు నెలల వ్యవధిలో 30 యూనిట్లు పంపిణీ చేస్తే 23 యూనిట్లలోని పిల్లలు మృతి చెందాయని, మంచి జాతి పిల్లలు కాకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. ఈ మేరకు విచారణ జరిపిస్తామని ఎంపీడీఓ అశోక్ తెలపగా.. సంరక్షణలోపంతోనే కోడిపిల్లలు చనిపోయి ఉంటాయని సెర్ప్ ఏపీఎం సంతోష్‌కుమార్ తెలిపారు.

### పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి

**దమ్మపేట:** అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావును మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మంగళవారం దమ్మపేటలో పరామర్శించారు. పైడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యేనుగంటి రాము, పామర్తి వెంకటేశ్వరరావు, కోమళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# సహాయకులు వస్తున్నారు..

**శిక్షణ పూర్తి చేసుకున్న మంచినీటి సహాయకులు**

- సురక్షిత నీటి సరఫరాపై సర్కార్ దృష్టి
- పకడ్బందీగా అమలు చేస్తేనే సత్ఫలితాలు

**కరకగూడెం:** ప్రస్తుత రోజుల్లో సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడం అనేది ప్రభుత్వాలకు అత్యంత కీలకమైన అవసరంగా మారింది. పలుచోట్ల పైపులైన్లు పగిలి నీరు కలుషితమవుతున్న తరుణంలో ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ సమస్యలను అధిగమించడానికి గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి నాణ్యత పరిశీలనతో పాటు బోర్లు, మోటార్లు పాడైతే అదేరోజు మరమ్మతులు జరిగేలా, పైపులైన్ల లీకేజీలను అరికట్టేలా గ్రామ మంచినీటి సహాయకులను నియమిస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ పంచాయతీకి ఒకరిని, మేజర్ పంచాయతీకి ఒకటి కంటే ఎక్కువ బహుళ నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకచ్చిన 'నల్ జల్ మిత్ర' పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. సురక్షిత నీటిని అందించడంతో పాటు మిషన్ భగీరథ నీటిపై ప్రజల్లో నమ్మకం పెంచేలా చర్యలు చేపట్టనుంది.

**ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశం..**

ఇదివరకు గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, పైపులైన్ల లీకేజీలతో నీరు కలుషితమవుతోంది. కానీ ఇప్పుడు అత్యవసర సమయాల్లో పంచాయతీలే స్వయంగా మరమ్మతులు చేసుకునేలా సహాయకున్ని నియమించి ప్రత్యేక శిక్షణ ద్వారా సుశిక్షితుడిగా తీర్చిదిద్దడం మంచి పరిణామం. శిక్షణ పొందిన మంచినీటి సహాయకులు నెలలో మూడు సార్లు ట్యాంకులను శుభ్రం చేయడం, నీటి సరఫరాలో అవసరమైన మరమ్మతులు చేయడంతో పాటు గ్రామస్తుల సమక్షంలో పరీక్షలు చేయనున్నారు. ఇదంతా ఒక మంచి ప్రణాళికతో చేస్తేనే ఆశించిన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.



శిక్షణ పూర్తిచేసుకున్న నీటి సహాయకులతో అధికారులు

### మాస్టర్ ట్రెయినీలతో శిక్షణ..



ఎంపిక చేసిన సహాయకులకు మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో పినపాక రైతువేదికలో శిబిరం ఏర్పాటు చేసి ఉమ్మడి మండలాలైన పినపాక, కరకగూడెం నుంచి 39 మందికి నాలుగు రోజులు శిక్షణ అందించి సర్టిఫికెట్లు అందజేశారు. నైపుణ్యం కలిగిన వారిని మాస్టర్ ట్రెయినీలుగా గుర్తించి హైదరాబాద్లో ప్రత్యేక తర్ఫీదు అందించారు. మాస్టర్ ట్రెయినీలు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో సహాయకులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ఈ నెల 3 నుంచి నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం పూర్తయ్యింది. శిక్షణ శిబిరంలో మొదటి రోజు చేతిపంపులు, బోర్ల, రెండో రోజు సింగిల్, త్రీఫేజ్ మోటారు, ప్యానెల్ బోర్డుల, విడిభాగాలు మూడో రోజు నల్లాల, పైపులైన్ల లీకేజీల మరమ్మతులు, పంపు సెట్లకు విద్యుతు సరఫరా, కొత్తవి అమర్చుట, నాలుగో రోజు నీటి నాణ్యత పరీక్షలు, నీటి పరీక్షల కిట్లపై అవగాహన కల్పించారు.

### చాలా విషయాలు నేర్చుకున్నాం



చేతి పంపుల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు అరికట్టడం, పంపుసెట్లు, ప్యానల్ బోర్డుల నిర్వహణ, నీటి నాణ్యత పరీక్షలపై క్షుణ్ణంగా అధికారులు అవగాహన కల్పించడంతో చాలా విషయాలు నేర్చుకున్నాం. ఎంతటి సమస్యనునైన పరిష్కరించగలననే ధీమా కల్పించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత మాపై ఉంది.

– ఆవుల రమేష్, కరకగూడెం జీపీ సహాయకుడు

### మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు



పైపు లైన్లు, చేతిపంపులు మరమ్మతులు చేయడానికి గతంలో పంచాయతీ పాలకులు తీవ్ర జాప్యం చేసి కాలం వెళ్లదీసేవారు. ఇప్పుడు ప్రభుత్వం గ్రామీణ మంచి నీటి సహాయకులను ఏర్పాటు చేసి ఎప్పటి సమస్యను అప్పుడే పరిష్కరించడం అనేది మంచి ఆలోచన. ఎట్టి పరిస్థితుల్లోనూ మరమ్మతుల్లో జాప్యం చేయొద్దు.

– ఏదూళ్ల సారయ్య, కొత్తగూడెం

### ప్రత్యేక తర్ఫీదు ఇచ్చాం



మంచి నీటి సహాయకులకు శిక్షణ శిబిరంలో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చాం. వారు అత్యవసర సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరిస్తారు.సురక్షిత నీటిని అందించడంతో పాటు నిరంతర నీటి సరఫరాకు ఈ శిక్షణ దోహదం చేయనుంది. నీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు ఉన్న ప్రజలు నీటి సహాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలి.

– బ్రహ్మదేవ్, మిషన్ భగీరథ డీఈ

# రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

**దమ్మపేట:** స్వయం సహాయక సంఘాలు రుణాలను సద్వినియోగపరచుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పురోగతి సాధించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక గిరిజన గురుకులంలో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలను స్వయం సహాయక సంఘాలకు, ఎమ్మెల్యే జారే చేతుల మీదుగా చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలోని మొత్తం 57 గ్రామాల్లో 1,333 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వారికి రూ.5 కోట్ల 78 లక్షల రూపాయల రుణాలను పంపిణీ చేశామన్నారు. మీ సేవ కేంద్రాలు, పాడి పరిశ్రమ, కోళ్ల, చేపల పెంపకం, కుట్టు మిషన్లు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ తదితర యూనిట్లకు ఈ రుణాలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులను సక్రమంగా వినియోగించుకుంటే, అదనంగా మరో కోటి రూపాయలను మంజూరు చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఐకేపీ అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# త్రీఫేజ్ కనెక్షన్లు ఇచ్చేశారు..

- పది రోజుల్లోనే పనులు పూర్తి



త్రీఫేజ్ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతు

సాక్షి ఎఫెక్ట్..

**అశ్వారావుపేటరూరల్:** పెదవాగు ఉప్పొంగి ధ్వంసమైన త్రీఫేజ్ విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల హామీ ప్రకారం పది రోజుల వ్యవధిలోనే పూర్తి చేశారు. దీంతో బాధిత రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. మండలంలోని గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గండ్లు పడి త్రీఫేజ్ విద్యుత్ లైన్లు, కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. కాగా, రెండు నెలలు గడిచిన ఈ సమస్యను విద్యుత్ శాఖ నిర్లక్ష్యం చేయడంతో 'సాక్షి' దినపత్రికలో గత నెల 28న 'త్రీఫేజ్ తిప్పలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన పాలవ్యంచ ట్రాన్స్‌కో డీఈఈ నందయ్య, స్థానిక ఇన్‌చార్జ్ ఏడీఈ లక్ష్మణ్ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా రైతుల సమస్యను తెలుసుకున్నారు. అదే రోజు డీఈఈ, ఏడీఈ 'సాక్షి'తో మాట్లాడుతూ.. పది రోజుల్లో త్రీఫేజ్ సమస్యను పరిష్కరించి, కనెక్షన్లు పునరుద్ధరిస్తామని వెల్లడించారు. తక్షణమే విద్యుత్ స్తంభాలు, వైర్లు , ట్రాన్స్‌ఫార్మర్లను గుమ్మడవల్లికు తరలించి స్థానిక ఇన్‌చార్జి ఏఈఈ సంతోష్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెట్టారు. దాదాపు ఇరవై మంది కార్మికులు, యంత్రాల సాయంతో గుమ్మడవల్లి గ్రామంలో ఉన్న 19 మంది రైతుల త్రీఫేజ్ విద్యుత్‌లైన్లను వేసి, పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రానికి త్రీఫేజ్ విద్యుత్ కనెక్షలు ఇచ్చి, త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను అందించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీసీకి దసరా సందడి..



ప్రయాణికులతో రద్దీగా ఉన్న భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్

**భద్రాచలంఅర్బన్:** బతుకమ్మ వేడుకలు ప్రారంభం కావడం, దసరా పండగ సమీపిస్తుండడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సందడి పెరిగింది. దీంతో భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలకు 140 వరకు అదనపు సర్వీస్‌లను నడిపిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో పట్టణాల నుంచి పల్లెబాట పట్టారు. భద్రాచలం నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వివిధ పట్టణాలకు, గ్రామాలకు దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్తున్నారు. దీంతో భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల రాకపోకలతో కిట కిటలాడుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకొని భద్రాచలం ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తున్నారు. భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు నిత్యం 35 బస్సు సర్వీసులు నడుపుతున్నారు. పండగ నేపథ్యంలో ఈ నెల 4 నుంచి మరో 11 వరకు అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆన్ లైన్ బుకింగ్ సౌకర్యం కల్పించారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నారు.

### రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

**మణుగూరు రూరల్:** మండలంలోని కూనవరం పంచాయతీలో పీవీకాలనీకి వెళ్లే రోడ్డు బ్రిడ్జి వద్ద సీసీ రోడ్డు ప్రమాదకరంగా మారిందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపడితే జరగబోయే ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

# పౌరసేవలు సమర్థవంతంగా అందించండి



కార్యదర్శులతో మాట్లాడుతున్న కుమార్

సాక్షి ఎఫెక్ట్..

**కరకగూడెం:** పౌర సేవల పట్టికలు ప్రభుత్వ విధానాలు, అందించే వివిధ సేవలు, పౌరుల హక్కుల గురించి స్పష్టమైన సమాచారాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని కరకగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుమార్ అన్నారు. మండలంలోని పలు పంచాయతీ కార్యాలయాల్లో కానరాని పౌర సేవల పట్టికల విషయాన్నీ తెలియపరుస్తూ 'పంచాయతీ సేవలపై నీలినీడలు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమవ్వగా స్పందించిన ఎంపీడీఓ మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. పౌర సేవల పట్టికలను తప్పకుండ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పౌర సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని ఆదేశించారు.

### సరుకులు, దుస్తుల పంపిణీ



సరుకులు, దుస్తులు అందజేస్తున్న దృశ్యం

**చర్ల:** మండలంలోని రామచంద్రాపురానికి చెందిన 60 కుటుంబాల ఆదివాసీలకు మంగళవారం చర్లలోని రాహూల్ విజ్ఞాన్ విద్యాలయం ఆధ్వర్యంలో దుస్తులు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. విద్యాలయం వ్యవస్థాపకుడు డాక్టర్ డీఎస్ కుమార్ కుమారుడు రాహూల్ జయంతిని పురస్కరించుకుని దుస్తులు, సరుకులు, పాదరక్షలు, విద్యార్థినులకు స్టేషనరీ అందజేశారు. రాహూల్ విజ్ఞాన్ ప్రిన్సిపాల్ వర్మరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక శిబిరం

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయలంలో నేడు(బుధవారం) దివ్యాంగులకు సహాయ ఉపకరణముల ఎంపిక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అర్హులైన దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన ఉపకరణములను ఎంపిక చేసి, అందిస్తామన్నారు. ఈ శిబిరానికి నియోజకవర్గంలోని అశ్వారావుపేట, ములకలపల్లి, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన దివ్యాంగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

# కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు



మణుగూరు టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..



చండ్రుగొండలో..



భద్రాచలంటౌన్: బతుకమ్మలతో ఐటీడీఏ మహిళా ఉద్యోగులు, తదితరులు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం ఐటీడీఏలో బతుకమ్మ సంబురాలలో భాగంగా వేపకాయ బతుకమ్మ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ఆవరణాలో మహిళా ఉద్యోగులతో పాటు ఐటీడీఏ ఉద్యోగుల కాలనీలోని మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చి ఒక చోట చేర్చి ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ రాహుల్ సతీమణి మనీషా, డీడీ మణెమ్మ మహిళా ఉద్యోగులు మాధవి, సుధారాణి, మణికుమారి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరు టౌన్:** ప్రాథమికఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వైద్యులు శివకుమార్ అధ్యక్షతన మధ్యాహ్నం మూడు గంటలకు బతుకమ్మలు పేర్చి ఏఎన్ఎంలు, ఆశాలు ఆడి పాడారు.

**చండ్రుగొండ :** మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ తనూజతోపాటు సిబ్బంది, ఆశవర్కర్లు బతుకమ్మలతో ఆటపాటలతో అలరించారు.

# భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

**దమ్మపేట:** మండల కేంద్రం దమ్మపేటలో శివశక్తి యూత్ ఆధ్వర్యంలో దారా మల్లిఖార్జునరావు కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని పూలు, అభరణాలు, పట్టు వస్త్రాలతో ఘనంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు అన్నదానం ప్రారంభించారు.

**భద్రాచలంటౌన్:** పట్టణంలోని భూపతిరావు కాలనీలో నవదుర్గ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నర్రా రాము, విజయ్, నాగేంద్ర, సుభాని, రాజేష్, జమీర్, సలీం, అబ్బాస్, మస్తాన్, సతీష్, చంటి, నవీన్, గౌతమ్, మంజిత్ తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరు టౌన్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ కనకదుర్గ మైసమ్మ అమ్మవారిని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ దర్శించుకుని పూజలు చేశారు. మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారి, ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేశ్ బాబు, రాజేశ్వర్‌రావు, అవినాష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**దీపోత్సవం**

అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని పీకే–1 సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన మండపం వద్ద అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాత్రి సహస్ర దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

**అశ్వారావుపేటరూరల్:** మండలంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ అలంకరణలో దర్శనం ఇవ్వగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కొత్త మామిళ్లవారిగూడెం గ్రామంలో అమ్మవారిని రూ.10 వేల కరెన్సీ నోట్ల దండతో అమ్మవారిని అలంకరించారు. నారంవారిగూడెం (శ్రీరంగాపురం) గ్రామంలోని శ్రీ విజయదుర్గా భవానీ ఆలయంలో అమ్మవారు శ్రీ సరస్వతి దేవీ అవతారంలో దర్శనం ఇవ్వగా, ఆలయ ధర్మకర్త బండి పుల్లారావు ఆధ్వర్యంలో పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

**కరకగూడెం:** మండల పరిధిలోని రాళ్లవాగు శ్రీ పెద్దమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మి దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు ఉల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దమ్మపేట: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జారే..



భద్రాచలంటౌన్: ఎమ్మెల్యే తెల్లం పూజలు..



మణుగూరుటౌన్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అశ్వారావుపేటరూరల్: కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ



కరకగూడెంలో..

# 'పోడు'కు పట్టాలివ్వాలి

**ములకలపల్లి:** పోడు సాగు చేస్తున్న అర్హులైన రైతులందరికీ హక్కు పత్రాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన మాధారం శాఖా మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సాగుదారులందరికీ పట్టాలిస్తామని ప్రగల్బాలు పలికిన గత పాలకులు కొందరికి మాత్రమే హక్కు కల్పించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ముందుగా ప్రధాన కూడలిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మాధారం శాఖ కార్యదర్శిగా ఊకంటి రవికుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు రవికుమార్, పొడియం వెంకటేశ్వర్లు, గౌరి నాగేశ్వరరావు, రావూజా, వినోద్, వెంకట్రావు, ఇందిర. నీలా, నాగబాబు. సత్యం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

**తులసమ్మ చెరువుకు మరమ్మతులు చేయాలి**

**దుమ్ముగూడెం:** మండలంలోని తులసమ్మ చెరువును మరమ్మతులు చేసి గ్రామాలకు సాగునీరందించాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పావులూరిపేట గ్రామంలో పార్టీ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు... చెరువు మరమ్మతులు చేస్తే పొలూరిపేట, గంగవరం, కొత్త నారాయణరావుపేట గ్రామాలకు చెందిన రైతులకు సాగునీరు అందించవంచని వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మడివి అర్జున్, సొసైటీ డైరెక్టర్ ఉబ్బా భద్రయ్య, సరియం ప్రసాద్, సీతారామయ్య, సుబ్బయ్య, మాజీ వార్డ్ మెంబర్ ఉబ్బా రాజులు, నాగేశ్వరరావు, రాజబాబు, వెంకటేశ్వర్లు, రామారావు, మడకం వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.